క్లుప్తంగా

శాలివాహన అన్నదాన సత్రానికి శంకుస్థాపన



నరసరావుపేట రూరల్: బీసీలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండలో శాలివాహన అన్నదాన సత్రం శంకుస్థాపన కార్యక్రమం శుక్ర వారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో పాటు శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులను అధికంగా బీసీలకు కేటాయించినట్టు తెలిపారు. అన్నదాన సత్రానికి 35 సెంట్ల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. దీంతో పాటు ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలను మంజూరు చేయించినట్టు తెలిపారు. సత్రం నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి మహాశివరాత్రికి సంఘీయులకు అందుబాటులోకి తీసుకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షులు రాధారపు సాంబయ్య, కాపర్తి వెంకటయ్య, అధ్యక్షులు దొంతల రంగయ్య, ప్రధాన కార్యదర్శి నవులూరి యల్లమంద, కమిటీ సభ్యులు కందుకూరి అశోక్ పాల్గొన్నారు.

స్మార్ట్‌వర్క్ ఎంతో ముఖ్యం

జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి



నరసరావుపేట రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే స్మార్ట్‌వర్క్ ఎంతో ముఖ్యమని జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె. పరంధామరెడ్డి తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరందామరెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగంలోను ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. డాక్టర్ కాకాని సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, డైరెక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగ మల్లేశ్వర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

విలువిద్య పోటీల్లో ఆరుషి రెడ్డికి మూడో స్థానం



నరసరావుపేట: సౌత్ ఇండియా సీబీఎస్‌సీ జోనల్ స్థాయి విలువిద్య పోటీలలో నరసరావుపేట పట్టణానికి చెందిన మాలపాటి మారుతి ఆరుషిరెడ్డి మూడో ర్యాంకు సాధించాడు. ఈ మేరకు శుక్రవారం రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు రామిరెడ్డిపేటలోని అతని గృహంలో దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అండర్–14 విభాగంలో నిర్వహించిన విలువిద్య పోటీలలో 170 మంది పోటీ పడగా, అందులో ఆరుషిరెడ్డి మూడో ర్యాంక్ సాధించడం అందరూ గర్వించతగ్గ విషయమన్నారు. త్వరలో డెహ్రాడూన్‌లో నిర్వహించే జాతీయ విలువిద్య పోటీలలో విజయం సాధించి నరసరావుపేటతో పాటు మన రాష్ట్ర ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. అదేవిధంగా చిన్నతనంలోనే అతనిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించిన తాత ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఏపీవీ రామలింగారెడ్డి, అమ్మమ్మ డాక్టర్ సరస్వతీ, అతని తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణను అందించి అతడిని ఈస్థాయిలో ఉండేందుకు కారణమయ్యారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పీవీఎం శరత్‌బాబు, కోశాధికారి మురళీ కృష్ణ, సభ్యులు కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్తా, మాజీ కౌన్సిలర్ షేక్.మస్తాన్ వలీ, విజేత షాపు నరసింహా రావు పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

ఈపూరు: అర్హులైన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లు సొసైటీ అధ్యక్షులు, వ్యవసాయ శాఖ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు పాల్గొని మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కౌలు రైతు కార్డులు పొందిన రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీఓ ఏవీ రంగ నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల మేరకు రుణాలు ఇవ్వాలని సూచించారు. ఎంపీపీ శాఖమూరి బుచ్చయ్యతో పాటు యూనియన్, జీడీసీసీ బ్యాంకులతో సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఆరోగ్యం కోసమే సురక్ష కార్యక్రమం

వేర్వేరు ప్రాంతాల్లో కొనసాగిన జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాలు



నరసరావుపేట శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందజేస్తున్న మహిళా డాక్టర్లు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాంక్షించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ కోరారు. పట్టణంలోని 19వ వార్డు అరండల్‌పేట రాజ్యలక్ష్మి వెంకాయమ్మ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిర ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నేడు ఎంతో ఖరీదైన వైద్యసేవలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇళ్లవద్దకే తీసుకొచ్చి ఉచితంగా అందజేస్తున్నారన్నారు. మంచి మందులు కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. డాక్టర్లు ఎం.మేఘన, ఆషాలత, ప్రవల్లిక, చైతన్యలు హాజరై వార్డుకు చెందిన 223 మందికి వైద్యసేవలు అందజేశారు. ఎవీరెడ్డి కంటి వైద్యశాలకు చెందిన సిబ్బంది రోగులకు కళ్లపరీక్షలు చేశారు. శిబిరంలో వైద్యసేవలు పొందిన వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, వలంటీర్లు సేవలు అందజేయగా వార్డు నాయకులు దొడ్డా బ్రహ్మారెడ్డి, తన్నీరు చంద్రశేఖర్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

బొల్లాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అన్నారు. మండలంలోని వడ్డెంగుంట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ ఒ.సుబ్బారావు, ఎంపీటీసీ శాసనాల వెంకట రాములు, జీడీసీసీ డైరెక్టరు డి.గోవిందు నాయక్‌లు పారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని సందర్శించి, ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఆరోగ్యంగా ఉండాలని, స్వచ్ఛమైన సురక్షితమైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకు ఉపయోగపడే అతి ప్రధానమైన వైద్యం అతిచేరువులో అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనదేనన్నారు. అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని, ముఖ్యమైన వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వివిధ కార్పొరేటు వైద్యశాలలకు చికిత్స కోసం పంపడం జరుగుతుందని, ఈ శిబిరంలో ప్రధానంగా పలు రకాల రోగాలకు 172 రకాలు మందులు ఉన్నాయని, నెలరోజులకు సరిపడా మందులు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. మారుమూల ప్రాంతాల్లో సైతం ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుతున్నాయని, ఇందుకు వైద్యులు తమవంతు కర్తవ్యంగా చికిత్సలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించడం ప్రభుత్వం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావించాలని ముఖ్యమంత్రి ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఇదీ ప్రజలు గుర్తించాలని తెలిపారు. గత 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు చేసిందేమిటని ప్రశ్నించారు. అవినీతి తప్ప రాష్ట్రానికి వరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. గతంలో రాజన్న పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ముస్లింలకు రిజర్వేషన్ వంటి పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా ఆయన తనయుడు జగనన్న ఈ వడ్డెంగుంట సచివాలయాని పలు పథకాల ద్వారా రూ.13.47 కోట్లు ఖర్చుచేశారని, గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంత ఖర్చు చేసిన దాఖలాలు ఉన్నాయని ప్రజలు గమనించాలన్నారు. అమ్మఒడి ద్వారా ఈ గ్రామానికి 439 మంది లబ్ధిపొందారని, పంట నష్టం కింద 177 మంది లబ్ధి చేకూరిందని తెలిపారు. అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి పాటు పడిన ముఖ్యమంత్రి అన్నారు. చంద్రబాబు పాలన కంటె, రాజన్న, జగనన్న పాలనలో పేదలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా వినుకొండ పట్టణానికి మంచినీరు సరఫరా లేదని, నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంచినీరుతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ వైద్య శిబిరంలో వెల్లటూరు, బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వీరనరేష్, ఎం.సాయి వినూత్న, ప్రత్యేక వైద్య నిపుణులు బి రాంబాబు, కె.పార్వతి, కంటివైద్యులు ఎస్‌కె జానీ హిరా వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో 751 మంది వైద్యసేవలు పొందారని, వీరిలో 90 మంది కంటి వైద్యం, మరో 9 మందిని వివిధ వ్యాధులకు ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ హాస్పిటల్స్‌కు రిఫర్ చేశామని ఈమేరకు వైద్యాధికారి జీవీ నరేష్ తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు వి.శ్రీదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార వంటల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలోఎం.రాజయ్య, ముండ్రు వెంకటేశ్వర్లు, యెలిశెట్టి నరసింహా రావు, మన్నెయ్య, జి.గోవిందు, జి.వెంకట స్వామి, శాసనాల వెంకట రంగయ్య పాల్గొన్నారు.

పమిడిపాడులో..

నరసరావుపేట రూరల్: మండలంలోని పమిడిమర్రు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 271 మంది వైద్య శిబిరానికి హాజరుకాగా వీరిలో 119 మంది మహిళలు, 143 మంది పురుషులు, 9 మంది విద్యార్థులు ఉన్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 98 మందికి పరీక్షలు నిర్వహించి 63 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. వైద్య పరీక్షలు అనంతరం వివిధ సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి మెరుగైన వైద్యం అవసరమని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మమత ప్రియ, డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ చైతన్యలు వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలవాల గ్రామంలో..

రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామంలో రొంపిచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 361 మంది రోగులకు పరీక్షలు నిర్వహించగా అందులో 183 మంది పురుషులు, 178 మంది మహిళలు, 22 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 238 మందికి అవసరమైన ల్యాబ్ టెస్ట్‌లు చేశారు. 44 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఏడుగురికి మెరుగైన వైద్యం అవసరమని నరసరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ ఫణి కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బారెడ్డి, స్థానిక వైద్యులు జగన్ నరసింహారెడ్డి, రేవతి బాయిలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ గద్దం బాల నాగమ్మ, తహసీల్దార్ అంకారావులు పర్యవేక్షించగా, ఆశలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.



పమిడిమర్రులో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



పమిడిమర్రులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం



పమిడిమర్రులో రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



అలవాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



అలవాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



అంగన్ వాడీ ద్వారా పోషకాహార కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



వడ్డెంగుంట సచివాలయంలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్యసిబ్బంది



వడ్డెంగుంట సచివాలయ పరిధిలోని వైద్యశిబిరంలో సలహాలు అందిస్తున్న వైద్యులు



పమిడిమర్రులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చైతన్య

సరస్వతీ నమస్తుభ్యం

చదువులమ్మకు విద్యార్థులు పూజలు

నర్సరావుపేట ఈస్ట్: దేవి శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు శుక్రవారం చేశారు. విఠంరాజుపల్లి వద్దనున్న సాయి బృందావనంలో నిర్వహిస్తున్న వేడుకల్లో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా హిమాలయ బాబా ఆధ్వర్యంలో మహాచండీ యాగం నిర్వహించారు. అలాగే రవ్వారం వెంకటేశ్వర జగన్మాత పీఠంలో జగన్మాత దుర్గాదేవి సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. సీతయ్య నగర్‌లోని కనకదుర్గ దేవాలయంలో పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకపరమేశ్వరి దేవాలయం, అంకాళమ్మ దేవాలయంతో పాటు పలుచోట్ల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: శరన్నవ రాత్రి వేడుకలు ఊరూవాడా భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి సామూహిక, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. 6వ రోజైన శుక్రవారం నాడు జగజ్జననీ జ్ఞాన మోక్షదాయని సరస్వతీదేవి అవతారంలో అలంకారకృతురాలై భక్తులకు దర్శనమిచ్చారు. బోయపాలెం పార్వతీదేవి, హరిహర క్షేత్రం ఆలయాలు, సొలస బ్రహ్మంగారి ఆలయం, లింగారావుపాలెం గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, యడ్లపాడులోని రాజరాజేశ్వరీ ఆలయాల్లో సరస్వతీగా అలంకరణ గావించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు తమ పిల్లల్ని తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు చేయించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవారు కన్నుల పండువగా కొలువుదీరారు. శుక్రవారం నన్నపనేని వెంకటరత్నం కళ్యాణమండప ప్రాంగణంలోని శృంగేరి శారదాంబ దేవాలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. చౌత్రా సెంటర్‌లోని గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సరస్వతిదేవి అలంకారంలో కొలువుదీరారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో సుప్రభాత సేవ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

లక్ష గాజులతో...

నరసరావుపేట రూరల్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారిని లక్ష గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చిలకలూరిపేటకు చెందిన వ్యాపారవేత్త తేళ్ల సుధీర్, స్రవంతి దంపతులు ఉభయదాతగా వ్యవహరించారు. ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం మూలనక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకుడు రావిపాటి సాయి భరత్ చిన్నారులచే విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో భక్తి బృందంచే భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెంలోని కోదండరామాలయంలో వాసవి కన్యకపరమేశ్వరీ అమ్మవారు సరస్వతి దేవిగ భక్తులకు దర్శనమిచ్చింది. చిన జీయర్ స్వామి శిష్యురాలు ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించి 101 మంది మహిళలతో 101 కళశా పూజలుచేశారు. ఆలయ నిర్వాహకులు పువ్వాడ వీరాంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మండలంలోని వడ్డెంగుంట జ్ఞానప్రసూనాంబా సమేత కాళహస్తీర స్వామి దేవాలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.



శావల్యాపురంలో సరస్వతీదేవి అమ్మవారి అలంకరణ



నరసరావుపేటలో సుందరేశ్వర ఆలయంలో...



నరసరావుపేటలో సరస్వతీ అలంకరణలో శారదాంబ



మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



బోయపాలెంలో ఆలయంలో సరస్వతిగా



ఉమామహేశ్వర స్వామి ఆలయంలో..



మహంకాళి అమ్మవారు ఇలా...



సొలస బ్రహ్మంగారి ఆలయంలో..



లింగారావుపాలెం శివాలయంలో..



వడ్డెంగుంట దేవాలయంలో ...



రామ్‌నగర్ కోదండ రామాలయంలో..



గణపవరంలో సరస్వతీ దేవిగా



శివప్రియనగర్‌లో కాత్యాయనీ దేవిగా..



విప్పర్ల శివాలయంలో సరస్వతీ దేవిగా..



రొంపిచర్ల లో సరస్వతీ దేవిగా..

ఎంబీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, సినీనటి మెహరీన్



నూతన షాపింగ్ మాల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, సినీనటి మెహరీన్

నరసరావుపేట: జిల్లా కేంద్రం, గేట్‌వే ఆఫ్ పల్నాడుగా ఉన్న నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఎంబీఆర్ (మునగాల భాస్కరరావు) షాపింగ్ మాల్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించగా, సినీనటి మెహరీన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర క్రితం నుంచి జిల్లా కేంద్రంగా ఉన్న నరసరావుపేటకు మరో షాపింగ్ మాల్ రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. వీటి వలన ప్రజలకు నాణ్యమైన దుస్తులతో పాటు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే ఎంబీఆర్ సంస్థకు తెనాలి, మచిలీపట్టణం మాల్స్ ఉండగా నరసరావుపేటలో మూడోది ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కేంద్రమైన తర్వాత పట్టణానికి వచ్చే ప్రజలు పెరిగారన్నారు. వస్త్ర వ్యాపారంలో ఎంతో అనుభవం గడించిన ఈ సంస్థ వలన ప్రజలకు ఉపయోగం ఉంటుందన్నారు. సినీనటి మెహరీన్ మాట్లాడుతూ ఏపీలో మరోమాల్ ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజల బడ్జెట్‌కు తగ్గట్లుగా దుస్తులు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ఈ మాల్‌ను ఆదరించి అభివృద్ధి చేయాలని కోరారు. సినీనటిని చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కిషోర్‌బాబు, మాల్ యజమానులు మునగాల వెంకటేష్-ప్రత్యూష, పవన్‌కుమార్-దీప్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల నూతన కార్యవర్గం సభ్యులు ఎంపిక ఏకగ్రీవంగా శుక్రవారం నిర్వహించారు. మండల అధ్యక్షులు ముండ్రు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్‌చందు, సహాయ కార్యదర్శిగా గణపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దుగ్గెంపూడి చిన వెంకయ్య మరో ఐదు మందితో కూడిన నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్‌చందు ఒక ప్రకటనలో తెలిపారు.

ఔషధ దుకాణ యజమానికి ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: అక్రమంగా నిషేధిత ఔషధాలు కలిగి ఉన్న కేసులో మెడికల్ షాపు యజమానికి ఏడాది జైలు, రూ.1.75 లక్షల జరిమానా విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మల్లమ్మ సెంటర్‌లోని ఈశ్వర్‌సాయి మెడికల్ దుకాణంపై ఔషధ నియంత్రణ అధికారులు 2015 డిసెంబర్ 11వ తేదీన దాడులు నిర్వహించి పశువులకు వినియోగించే నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను గుర్తించారు. వాటిపై తయారీ తేదీ, ఎక్కడ తయారు చేసింది, గడువు ముగిసే తేదీ లేకపోవటంతో అవి నకిలీవిగా భావించి సుమారు 384 ఇంజక్షన్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుకాణ యజమాని షేక్ రబ్బానీపై కేసు నమోదు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో నిందితుడికి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

దాచేపల్లి: వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీ సంధ్యారాణి శుక్రవారం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడికి చెందిన యరమాల లక్ష్మీనారాయణ భార్య అనూష (20) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి మాధవీ ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.